

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	165	183
సూర్యాపేట	రూ.115	170	200
నల్లగొండ	రూ.109	158	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 18.0





లోక్‌సభ బరిలో వారసులు?

> త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వారసులను బరిలో నిలిపేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలు పార్టీల సీనియర్ నాయకులు పావులు కదుపుతున్నారు. కాంగ్రెస్ నేతలతో పాటు బీఆర్ఎస్ నాయకులు వారి కుటుంబ సభ్యులకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.
> - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలను కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతుండగా, ఒక అసెంబ్లీ స్థానం మినహా మిగతా 11 స్థానాలను కోల్పోయిన బీఆర్ఎస్, నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తూ సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్లమెంట్ ఎన్నికలకు వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలు గెలుపొందడంతో సమరోత్సాహంతో రెండు పార్లమెంటు స్థానాలను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఈ స్థానాల బాధ్యతలను మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుకు పార్టీ అధిష్ఠానం అప్పగించింది.

వారసులను బరిలో దింపేందుకు..

పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ నుంచి తానే లోక్‌సభకు పోటీ చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జనారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఏ కారణం చేతనైనా బరిలో దిగలేక పోతే తన కుమారుడు రఘువీర్‌రెడ్డితో పోటీ చేయించే ఆలోచనలో ఆయన ఉన్నారు. రఘువీర్ 2018లోనే మిర్యాలగూడ అసెంబ్లీ స్థానం నుంచి, నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని ప్ర యత్నించారు. అప్పట్లో అవకాశం రాకపోవడంతో ఈ సారి బరిలో దిగాలని గట్టి గా ప్రయత్నిస్తున్నారు. భువనగిరి నుంచి కోమటిరెడ్డి కుటుంబ సభ్యులను బరిలో దింపాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే

రేసులో సీనియర్ నేతల కుటుంబ సభ్యులు

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిని పోటీ చేయించాలని నిర్ణయించుకుని టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. లేదంటే ఆయన సోదరుడైన కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డిని బరిలో దించుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ నుంచి నల్లగొండ లేదంటే భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డిని పోటీ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సుఖేందర్‌రెడ్డి చాలా కాలం నుంచి తన కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం అంగీకరిస్తే అమిత్ లోక్‌సభకు పోటీచేస్తారని ఇప్పటికే ఆయన ప్రకటించారు.

అమిత్ నల్లగొండ లేదంటే భువనగిరి నుంచి పోటీ : గుత్తా

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి నల్లగొండ లేదా భువనగిరి ఏదో ఒక నియోజకవర్గ నుంచి ఎంపీగా పోటీ చేస్తారని స్పష్టం చేశారు. తాను ఎంపీగా పనిచేసినప్పుడు ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు తన పరిధిలో ఉన్నాయన్నారు. అమిత్‌రెడ్డి పోటీ విషయం పార్టీ చర్చించనుందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్యాడర్‌ను కాపాడుకోవడం కోసం పోటీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయామన్న బాధలో ఉండకుండా పార్లమెంటు స్థానానికి పోటీచేసి కార్యకర్తలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లో వ్యతిరేకత అనేది సహజమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మొదట 12 లోక్ సభ స్థానాలు గెలుస్తామని, ఆ తరువాత 14 స్థానాలు గెలుస్తామని చెబుతున్నారని, అయితే ఏ పార్టీ అయినా తాము గెలుస్తామనడం సహజమన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థనూ చులకనగా చూడకూడదని సీఎం రేవంత్‌రెడ్డి శాసనమండలిపై చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి అన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు లాంటి రాజకీయాలు తెలంగాణలోకి రావొద్దని తాను కోరుకుంటున్నానని అన్నారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు చర్యలు సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక నెల పరిపాలనపై ఇప్పుడేం మాట్లాడలేమని అన్నారు. ఏ ప్రభుత్వమైనా మంచి చేస్తే స్వాగతిస్తామని అన్నారు.

జిట్టా దారెటు?

» బీఆర్ఎస్ కీలక సమావేశానికి గైర్హాజరు
» భువనగిరి ఎంపీ స్థానంపై గురి

యాదాద్రి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ వాతావరణం మళ్లీ మారుతోంది. వచ్చే ఎన్నికల్లోగా ఏ నేత ఏ పార్టీల్లో ఉంటారనేది చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరినా ఆ ఎన్నికల్లో నియోజకవర్గంలో పెద్దగా ప్రచారంలో పాల్గొనలేదు. ఎన్నికల నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి కీలక సమావేశానికి జిట్టా గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. భువనగిరిలో ఏర్పాటుచేసిన తన కార్యాలయానికి సైతం ఆయన తెలంగాణ ఉద్యమకారుడని బోర్డు పెట్టారు గానీ, బీఆర్ఎస్ నేత అని ఎక్కడా లేదు. దీంతో ఆయన ఏ పార్టీ వైపు వెళ్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. జిట్టా జిల్లాలో సంక్రాంతి సంబురాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు జిల్లాస్థాయి గ్రామీణ క్రీడలు, తెలంగాణ ఉద్యమకారులతో సమావేశాలు పార్టీతో సంబంధం లేకుండా నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన త్వరలో బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పే అవకాశం ఉందని ప్రచారంలో ఉంది. ఇదిలా ఉండగా, కాంగ్రెస్‌లో చేరికపై ఆ పార్టీ అధిష్ఠానంతో ఆయన సంప్రదింపులు చేస్తున్నట్టు సమాచారం. ఉద్యమకారుడిగా భువనగిరి ఎంపీ టికెట్ కేటాయించాలని కోరిన ఆయన కాంగ్రెస్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్టు ప్రచారంలో ఉంది. అయితే జిట్టా మాత్రం ఉద్యమకారుడిగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నానని, ఏ పార్టీ నుంచి అనేది సమయం వచ్చినప్పుడు చెబుతానని అన్నారు.

సంక్రాంతి ముందు సిలిండర్ల కొరత

» రూ.500కే గ్యాస్ సిలిండర్, పెట్రో ట్యాంకర్ల సమ్మె ఎఫెక్ట్
» మోత్కూరులో బారులు తీరిన వినియోగదారులు » లోడ్ రాగానే తీసేసుకుంటున్న వైనం

> సంక్రాంతి పండగకు పిల్లలు, బంధువులు ఇంటికి వస్తుంటారు. ఓ రెండు రోజులు ముందుగానే పిండి వంటలు చేద్దామని మహిళలు ఉపక్రమించగా, ఇంట్లో వంట గ్యాస్ ఖాళీ అయింది. గ్యాస్ సిలిండర్ తీసుకుందామని బుక్ చేస్తే రాలేదు. డోర్ డెలివరీ బోయ్‌ను వాకబు చేస్తే స్టాక్ లేదని సమాధానమిస్తున్నాడు. గోదాం వద్దకైనా వెళ్లి తెచ్చుకుందామంటే అక్కడా స్టాక్ లేదు. దీంతో సంక్రాంతి పండుగకు పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.
> - మోత్కూరు



మోత్కూరులో గ్యాస్ సిలిండర్ల కోసం బారులు తీరిన వినియోగదారులు

మోత్కూరు భారత్ గ్యాస్ గోదాంకు శుక్రవారం ఒక లోడ్‌లో 340 గ్యాస్ సిలిండర్లు వచ్చాయి. సిలిండర్లు వస్తాయని తెలియడంతో లోడ్ రాక ముందు నుంచే వినియోగదారులు గోదాం వద్ద బారులు తీరారు. లోడ్ రాగానే సిలిండర్లు గోదాంలో దించకుండానే లారీ వద్ద నుంచే వినియోగదారులు తీసేసుకుంటున్నారు. క్యూలో నిల్చున్న వారిలోనూ పలువురికి సిలిండర్లు అందక వెనుతిరిగారు. వినియోగదారులు గోదాం వద్దకే వెళ్లి తీసుకోవడంతో డోర్ డెలివరీ చేసే వాహనానికి సిలిండర్లు లేక డెలివరీ బాయ్స్ గ్రామాలకు వెళ్లలేకపోయారు. దీంతో గ్రామీణ ప్రజలకు బుక్‌చేసినా సిలిండర్లు అందడం లేదు.

కాంగ్రెస్ హామీ, ట్యాంకర్ల సమ్మె ఎఫెక్ట్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్, రూ.400లకు సిలిండర్ ఇస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చాయి. ఎవరు అధికారంలోకి వచ్చినా సిలిండర్ నాలుగైదు వందలకే లభిస్తుంది కదా అని డబుల్ సిలిండర్ ఉన్న వినియోగదారులంతా గ్యాస్ ఖాళీ అయినా నవంబరు నుంచి కొత్త సిలిండర్లు తీసుకోలేదు. డిసెంబరులో ఎన్నికల ఫలితాలు వెలువడి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొద్ది రోజులు ఆగితే రూ.500లకే సిలిండర్ వస్తుందని ఇంట్లో గ్యాస్ పూర్తయినా తీసుకోకుండా పక్కింటి వారి నుంచి, స్నేహితుల వద్ద నుంచి అదనపు సిలిండర్ బదులు తీసుకొని నెట్టుకొచ్చారు. తాజాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరించడంతో రూ.500కు సిలిండర్ ఇచ్చేందుకు సమయం పడుతుందని భావించిన వినియోగదారులు జనవరి 1 నుంచి వాటి కోసం ఎగబడ్డారు. ఇదిలా ఉండగా, ఇటీవల పెట్రో ట్యాం కర్ల యజమానులు నాలుగు రోజులు సమ్మె చేశారు. దీంతో స్టాక్ పాయింట్ల వద్ద గ్యాస్ నిల్వలు తగ్గాయి. దీంతో మోత్కూరు భారత్ గ్యాస్ గోదాంకు రోజు విడిచి రోజు ఒక లోడ్ రావాల్సి ఉండగా, నాలుగైదు రోజులకు ఒక లోడ్ వస్తోంది. ఇటు సకాలంలో కావాల్సినన్ని సిలిండర్లు సరఫరా కాక, అటు ఒక్క సారిగా డిమాండ్ పెరగడంతో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడింది. మోత్కూరు భారత్ గ్యాస్ గోదాం పరిధిలో మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలతో పాటు తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో దీపం పథకం గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్ల కొరత కారణంగా డోర్ డెలివరీ కాంట్రాక్టరు గ్రామాలకు తీసుకెళ్లలేకపోవడంతో గ్రామాలు, మండల కేంద్రాల నుంచి వినియోగదారులు మోత్కూరు గోదాంకు వచ్చి తీసుకెళ్తున్నారు. పండుగ ముందు ఈ కష్టాలేంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోత్కూరు లో గ్యాస్ కొరతపై అదనపు కలెక్టర్ సైతం ఆరా తీసినట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 10.80లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కాగా, పలుచోట్ల అన్ని కంపెనీల గ్యాస్ గోదాంల వద్ద ఇదే పరిస్థితి ఉంది.

మూడు వారాలుగా గ్యాస్ సిలిండర్లు రాలేదు




మోత్కూరు భారత్ గ్యాస్ గోదాం నుంచి ఆత్మకూరుకు గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతుంటాయి. మేం ఆన్‌లైన్‌లో గ్యాస్ సిలిండర్ బుక్ చేసి సుమారు మూడు వారాలు అవుతోంది. నేటికీ సిలిండర్ రాలేదు. మూడు వారాలుగా గ్రామానికి సిలిండర్ల వ్యాన్ రాలేదు. గ్యాస్ సిలిండర్ ఖాళీ అవడంతో పండుగ ముందు ఇబ్బంది అవుతోంది. వెంటనే గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలి. - ఎలిమినేటి లక్ష్మి, ఆత్మకూరు(ఎం)

సరఫరా తక్కువ, డిమాండ్ ఎక్కువ



మోత్కూరు గోదాంకు రోజు విడిచి రోజు సిలిండర్ల లోడ్ రావాల్సి ఉంది. పెట్రో ట్యాంకర్ల సమ్మె కారణంగా కంపెనీల నుంచి మూడు, నాలుగు రోజులకు ఒక లోడ్ వస్తోంది. అదీకాక రెండు మాసాలుగా వినియోగదారులు సిలిండర్లు తీసుకోకుండా ఇప్పుడు అంతా ఒక్కసారిగా రావడంతో కొరత ఏర్పడింది. వారం రోజుల్లో అంతా సర్దుకుంటుంది.
- ఆంజనేయులు, మోత్కూరు భారత్ గ్యాస్ గోదాం ఇన్‌చార్జి

హైవే, సంక్రాంతి రద్దీ



(యాదాద్రి-ఆంధ్రజ్యోతి)/ చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, బీబీనగర్: సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు ప్రజలు సొంతూళ్లకు పయనమయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ముఖ్యమైన పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఈ పండుగకోసం పల్లెలకు బయలుదేరిన వాహనదారులతో శుక్రవారం జాతీయ రహదారులు రద్దీగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బీబీనగర్ మండలం గూడూరు టోల్‌గేట్, చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌గేట్లు వాహనాలతో కిక్కిరిశాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 77వేల వాహనాల రాకపోకలు సాగించినట్లు టోల్‌గేట్ల నిర్వాహకులు తెలిపారు. •7లో..

రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేయాలి



నల్లగొండ సాగునీటి ప్రాజెక్ట్‌లపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం
మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సమీక్షలో మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, జనవరి 12: జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రోడ్లు, భవనాలు, సాగునీటి శాఖ మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి దిశానిర్దేశం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మెజారిటీ పనులు పూర్తయిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కూడా నిర్లక్ష్యం చేశారన్నారు. తాను స్వయంగా ఎన్నోసార్లు ఈ ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో మాట్లాడినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నల్లగొండలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో ఉందన్నారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉండటం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ లక్ష ఎకరాలకు సాగునీరందించే ఉదయసముద్రం, బ్రాహ్మణవెల్లెంల పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఎస్ఎల్‌బీసీ కాల్వలను పూర్తిచేసినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం నిర్వహణ కూడా చేయలేదు. ఎస్ఎల్‌బీసీ కాల్వలకు, వరద కాల్వకు గత పదేళ్లనుంచి నిర్వహణ లేకపోవడంతో చెట్లు, పూడిక పెరిగాయన్నారు. వీటికి మరమ్మతులు చేపట్టాలని, ఈ సంవత్సరంలోనే పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు కింద మొదటిదశలో 50వేల ఎకరాలకు, రెండో దశలో మరో 50 వేల ఎకరాలకు భూసేకరణ చేపట్టడం, కాల్వలను తవ్వే పనులను పూర్తిచేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జ, ఈఎన్‌సీ మురళీధర్ రావు, చీఫ్ ఇంజనీరు అజయ్ కుమార్, డిప్యూటీ ఈఎన్ సీ జనరల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్ర ఓటరుగా నమోదు చేసుకోవాలి

కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, జనవరి 12: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్ర నియోజకవర్గంలో అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ హరిచందన కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2023 నవంబరు 1 కంటే ముందు డిగ్రీ ఉత్తీర్ణులైనవారు, స్థానికులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీఎన్నికకు నూతన ఓటర్ జాబితా తయారు చేస్తున్నందున ఇంతకు ముందు కూడా ఓటరుగా ఉన్నవారు సైతం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలోగానీ ఆన్‌లైన్‌లోగానీ సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు గడువు ఫిబ్రవరి 6వ తేదీ అని, ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేస్తామన్నారు. ముసాయిదాపై అభ్యంతరాలు ఉంటే ఫిబ్రవరి 24 నుంచి మార్చి14వ తేదీ వరకు తీసుకుంటామన్నారు. మార్చి 29వరకు వాటిని పరిశీలించి ఏప్రిల్ 4న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ 2024లో భాగంగా ఓటరుగా నమోదు చేసుకునేవారు 2023 నవంబరు 1నాటికి 18ఏళ్లునిండిన వారు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ నమోదు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 8నతుది జాబితా విడుదల చేస్తామన్నారు.



రైతు బజార్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

అభివృద్ధి పనుల పరిశీలన

జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులను కలెక్టర్ హరిచందన పరిశీలించారు. ఐటీ టవర్‌తోపాటు పలు జంక్షన్లు, ఫుడ్ బజార్, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, రైతు బజార్‌ను ఆమె పరిశీలించారు. మేకల అభినవ్ ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాన్ని పరిశీలించి స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న తైక్వాండో, బ్యాడ్మింటన్, అవుట్ డోర్ స్టేడియంలో క్రికెట్ పోటీలను తిలకించారు. అదేవిధంగా తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవి, ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నీలగిరికి జాతీయ ర్యాంకు •9లో

శాస్త్రోక్తంగా కూడారై ఉత్సవం



ఆండాళ్ అమ్మవారికి 108 గిన్నెల్లో పాయసాన్ని నివేదిస్తున్న ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, జనవరి 12:యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం కూడారై మహోత్సవం, నీరాటోత్సవం, సాయంత్రం వేళ ఊంజల్ సేవోత్సవం శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో ఘనంగా నిర్వహించారు. కొండగుహలో కొలువుదీరిన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో ధనుర్మాసోత్సవాలు నిర్వహించారు. లక్ష్మీనృసింహుడికి నిత్య పూజలు నిర్వహించిన పూజారులు మధ్యాహ్నం వేళ ఆండాళ్ అమ్మవారిని పెళ్లి కూతురుగా అలంకరించి నీరాటోత్సవాలను సంప్రదాయరీతిలో చేపట్టారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై పాశుర పఠనంతో అమ్మవారిని కొలిచిన అర్చక బృందం 108 గంగాళాల్లో పాలతో తయారు చేసిన పాయసాన్ని నివేదించి భక్తులకు వితరణ చేశారు. సాయంత్రం వేళ ఆండాళ్ అమ్మవారిని ఆరాధిస్తూ ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ కూడారై మహోత్సవం, స్వామికి నిత్య పూజలు, ఊంజల్ సేవా పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,62,273ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడ్డ జింక



చింతపల్లి, జనవరి 12 : జనావాసాల మధ్యకు వచ్చిన జింక కుక్కలదాడిలో స్వల్పంగా గాయపడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. మర్రిగూడ అటవీ ప్రాంతం నుంచి జింక చింతపల్లి మండలం కుర్మేడు స్టేజీ సమీపంలో జనవాసంలోకి వచ్చింది. జింకను గమనించిన కుక్కలు వేటాడుతుండగా ఎక్స్‌రోడ్డుపై ఉన్న ఫంక్షన్‌హాల్ గోడకు తాకి కిందపడింది. జింక వద్దకు వచ్చిన కుక్కలు దానిని గాయపరుస్తుండడంతో స్థానికులు కుక్కలను తరిమేశారు. వెంటనే స్థానికులు సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో వెంకటకృష్ణ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని జింకను వాహనంలో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అటవీశాఖ బీట్ ఆఫీసర్ ఉదయ్ కుమార్‌కు అప్పగించారు. మెరుగైన వైద్యం కోసం జింకను జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం అటవీ ప్రాంతంలో వదిలేస్తామని ఫారెస్ట్ బీట్ అధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ నాగేశ్వర్‌రావు

వేములపల్లి, జనవరి 12: సాగర్ ఎడమకాల్వ కట్ట మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎన్నెస్పీ ఎస్ఈ పీవీఎస్.నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అన్నపరెడ్డిగూడెం గ్రామ సమీపంలో చేపడుతున్న నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్టల మరమ్మతు పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సాగర్ ఎడమకాల్వ కట్ట కోతలకు గురై తెగకుండా ఉండేందుకు బలహీనంగా ఉన్న చోట్లను గుర్తించి రూ.14.9కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు పెద్దదేవులపల్లి రిజర్వాయర్ నుంచి తడకమళ్ల రెగ్యులేటర్ వరకు గల కాల్వ కట్టను పరిశీలించి బలహీనంగా ఉన్న మరికొన్ని ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. వాటికి సంబంధించి రూ.21కోట్లతో అంచనాలను రూపొందించామని త్వరలో పనులను చేపడతామని పేర్కొన్నారు. కాల్వకట్ట మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట డీఈ గోపీనాథ్, కాంట్రాక్టర్ లక్ష్మారెడ్డి, వర్క్ ఇన్స్‌పెక్టర్ నర్సయ్య తదితరులు ఉన్నారు.

పల్లెకు పండుగ శోభ



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఊర్లు సంక్రాంతి పండుగ శోభను సంతరించుకుంటున్నాయి. రేపటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పండుగంటే మహిళలకు, పిల్లలకు ఎక్కడా లేని ఆనందం.. రంగ వల్లులు వేయడంలో మహిళలు మునిగితేలుతుంటే.. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేయనున్నారు. తెల్లవారుజామున హరిదాసుల కీర్తనలు.. ఇళ్ల వాకిళ్లలో ముగ్గులు, ఆ మధ్యలో సంస్కృతిని ప్రతిబింబించే గొబ్బెమ్మలతో పండుగ సందడి మరింత పెరగనుంది. నందీశ్వరుడి అలంకరణలో గంగిరెద్దులు చేసే విన్యాసాలు, ఎడ్ల పందేలు, బొమ్మల కొలువు, అరిశెలు తదితర పిండి వంటకాల తయారీలతో ఎక్కడా చూసినా పండుగ వాతావరణమే కనిపించనుంది. ఉపాధి ఇతర అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుతుండటంతో బస్టాండ్లు, ప్రధాన రహదారులపై రద్దీ నెలకొంది.

- నల్లగొండ కల్చరల్



భూదాన్‌పోచంపల్లి లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో హరిదాసుల వేషధారణలో విద్యార్థులు



చౌటుప్పల్ లోని శ్రీ గాయత్రీ కళాశాలలో ముగ్గులు వేస్తున్న బాలికలు



చిట్యాలలోని చెరుకు గడలు, పాలకుండలతో అలంకరణ



చౌటుప్పల్ లోని చందన స్కూల్‌లో అలరించిన హరిదాసుల వేషధారణ, నాగార్జునసాగర్‌లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో హరిదాసు వేషధారణలో ఉన్న విద్యార్థి



సాగర్ పైలాన్ కాలనీ డీఏవీ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

రేపు భోగి

మూడు రోజు సంక్రాంతి పండుగలో మొదటి రోజు భోగి నిర్వహిస్తారు. పంటలు ఇంటికి చేరి భోగాలతో విశ్రాంతి తీసుకునే కాలం కాబట్టి భోగి అని పేరొచ్చింది. అదేవిధంగా గోదాదేవి 30 రోజులు తిరుప్పావై వ్రతం చేసి శ్రీరంగనాథుడితో చేరి భోగాలు పొందిన దినం. అందుకే భోగి పండుగ అని పిలుస్తారు.

విశేష పర్వాలు

ఈ రోజున గోదా రంగమన్నార్‌ల కల్యాణం నిర్వహిస్తారు. చిన్నారులపై భోగి పళ్ళు(రేగు పళ్ళు, నువ్వుండలు, పూలు) పోయటం ఆచారం. అదేవిధంగా ఇంట్లో ఉన్న పాత వస్తువులతో భోగి మంటలు వేయడం సంప్రదాయం.

మకర సంక్రాంతి

సంక్రాంతి అంటే గమ్యం అని అర్థం. ఈ రోజు పితృదేవతలకు తిలోదకాలు విడవటం ఆచారం. సంక్రాంతి నాడు ఉదయమే లేచి నువ్వులపొడితో అభ్యంగన స్నానం చేస్తారు. సంక్రమణ ఘడియలో ఏ కొద్దిపాటి పుణ్య కార్యం చేసినా విశేష ఫలితం లభిస్తుందని విశ్వాసం.

కనుమ

మూడు రోజుల పండుగలో చివరి రోజు కనుమ ఉంటుంది. ఈ రోజున గోపూజ చేయటం ఆచారం. పశువుల్లో దైవాలను చూస్తూ వాటిని భక్తి భావంతో ఆదరించటాన్ని ఈ పండుగ నేర్పిస్తుంది. పంటలు పండడానికి కారణమైన స్వరూపం ఎద్దు, అందువల్ల రైతుల పండుగ కాబట్టి గంగిరెద్దులను పూజిస్తారు.




గోరింటాకు పెట్టుకుంటున్న ఆడపడుచులు

రథం ముగ్గు

సంక్రాంతి పండుగలో రంగవల్లులకు ప్రత్యేక స్థానం ఉంది. కనుమ రోజున ప్రతి ఇంటి ముందు రథం ముగ్గు వేయటం సంప్రదాయం. ప్రతి వ్యక్తి శరీరం రథం అని, దాన్ని నడిపేవాడు పరమాత్మ అని భావిస్తూ శరీరమనే రథాన్ని సన్మార్గంలో నడపమని ప్రార్థించటం ఈ పండుగలో కనిపిస్తుంది.

భువనగిరిలో ఆకట్టుకున్న సంక్రాంతి సంబురాలు, క్రీడా పోటీలు



భువనగిరిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గంగిరెద్దు విన్యాసాలు



కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్న యువతులు



కబడ్డీ పోటీల్లో

భువనగిరిలో మూడు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి సంబురాలతో పాటు జిల్లా స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఉద్యమకారుడు జిట్ట బాలకృష్ణారెడ్డి క్రీడోత్సవాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించి, మాట్లాడారు. ఒకే ప్రాంగణంలో ఒక వైపు దేశ వాళి, మరోవైపు సంప్రదాయ క్రీడా పోటీలు మరో వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు జరిగిన తీరు అందరినీ అబ్బురపర్చాయి. చలిని లెక్కచేయకుండా పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రహదారులపై రద్దీ...

పండుగ కోసం పల్లెలకు చేరుతున్న ప్రజలతో ఉమ్మడి జిల్లాలోని రహదారులన్నీ రద్దీగా మారాయి. ప్రధానంగా హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారులపై రద్దీ విపరీతంగా పెరిగింది. జిల్లాకు వచ్చే మార్గాల్లో వాహనాలు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. టోల్ ప్లాజాల వద్ద వాహనాల ప్రయాణం నెమ్మదించింది.

చౌటుప్పల్ టౌన్, రూరల్ / బీబీనగర్ / కోదాడ రూరల్

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్- విజయవాడ(65వ) జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో గురువారం సాయంత్రం నుంచే హైదరాబాద్ నుంచి వాహనాల జోరు మొదలైంది. శుక్రవారం నగరం నుంచి రాష్ట్రంలోని ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాలకు వెళ్లే వారి వాహనాలు నాలుగు వరసలుగా కదలి వెళ్తున్నాయి.ఆర్టీసీ బస్‌లు, లారీలకు రహదారిపై అవకాశం లేకుండా వాహనాలు పరుగులు తీస్తున్నాయి.

55వేల వాహనాలకు పైగా రాకపోకలు

పంతంగి టోల్‌గేట్ వద్ద 16 గేట్లకు 10 గేట్ల ద్వారా వాహనాలను విజయవాడ వైపు పంపించారు. సాధారణ రోజుల్లో 35 వేల నుంచి 40వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా సంక్రాంతి పండుగ నేపథ్యంలో శుక్రవారం 55 వేల వాహనాలు అదనంగా రాకపోకలు సాగించినట్టు జీఎంఆర్ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అత్యవసర సమయాల్లో 1033కి ఫోన్ చేయాలని శ్రీధర్‌రెడ్డి కోరారు. పండుగకు స్వగ్రామాలకు బయలుదేరే వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన ఫాస్టాగ్‌లను తప్పని సరిచూసుకోవాలన్నారు. వాహనాదారుడి అకౌంట్‌లో సరిపడా నగదు ఉండేలా చూసుకోవాలన్నారు.



పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

కోదాడ సమీపంలోని రాష్ట్ర సరిహద్దులో..

సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర సరిహద్దులోని సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. కొమరబండ నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు వరకు వాహనాలు భారీగా ఆంధ్రప్రదేశ్ వైపునకు తరలివెళ్లాయి. కొమరబండ, దుర్గాపురం, రామాపురం బైపాస్‌ల వద్ద పోలీసులు ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.



నల్లగొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

గూడూరు టోల్‌ప్లాజా వద్ద

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సంక్రాంతి రద్దీ పెరిగింది. సాధారణ రోజుల్లో 19 వేల నుంచి 20 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా శుక్రవారం రోజు అదనంగా రెండు వేల వాహనాలు పెరిగి 22 వేల వాహనాలు టోల్‌ప్లాజామార్గంలో రాకపోకలు కొనసాగించాయని టోల్‌ప్లాజా అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల పాటు రద్దీ ఉంటుందన్నారు.

కైట్ ఫెస్టివల్



చారిత్రాత్మక భువనగిరి ఖిల్లాపై శుక్రవారం కైట్ ఫెస్టివల్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికైన భువనగిరి ఖిల్లా ప్రమోషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎల్ అండ్ టీ, రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్, హెరిటేజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు పతంగులను ఎగురవేశారు.

● భువనగిరి టౌన్

ఆగిఉన్న బైక్‌ను ఢీకొట్టి మృతి



రామకృష్ణ(ఫైల్)

మేళ్లచెర్వు, జనవరి 12 : ఆగివున్న బైక్‌ను ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో జరిగింది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మం డలంలోని గుడిమల్కాపురం గ్రామానికి చెందిన బం డారు రామకృష్ణ, ప్రసాద్, జగ్గయ్యపేట నుంచి గుడిమల్కాపురం వైపు బైక్ వస్తున్నారు. గుడిమల్కాపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఆగియున్న మరో బైక్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో బండారు రామకృష్ణ(34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై రామకృష్ణ తండ్రి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మరో ప్రమాదంలో వ్యక్తి...

ఓ సిమెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. విశ్వసనీయ సమాచారం మేరకు కంపెనీలో బీహార్ రాష్ట్రం రోహటాస్ జిల్లా పేవండి గ్రామానికి చెందిన హరినారాయణ సింగ్(48) పనిచేస్తున్నాడు. భారీ క్రేన్ సహాయంతో ఐరన్‌పైప్ ఎత్తుతుండగా బరువుకు క్రేన్ బెల్టు తెగి నారాయణ సింగ్‌పై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లుసమాచారం.

చెరువులో పడి బాలుడి ..

బీబీనగర్, జనవరి 12: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతి చెందాడు. గూడూరు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొంతం బస్వారెడ్డి జ్ఞానేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతోష్‌రెడ్డి (9) ఉన్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో సంతోష్‌రెడ్డి ఆడుకోవడానికి ఇంటినుంచి వెళ్లాడు. మధ్యాహ్నం అవుతున్నా ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు బాలుడి కోసం వెతకసాగారు. అదేసమయంలో ఇంటి సమీపంలోని చెరువు నీటి గుంటలో సంతోష్‌రెడ్డి మృతదేహం తేలుతూ కనిపించడాన్ని మృతుడి సోదరి చూసి కుటుంబసభ్యులకు తెలిపింది. గ్రామస్థుల సహకారంతో నీట మునిగిన బాలుడిని వెలికి తీశారు. బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెంది ఉంటాడని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. సంతోష్‌రెడ్డి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోదాడ రూరల్, జనవరి 12: కారును వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి.ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో జరిగింది. రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వెళ్తున్న కారును శుక్రవారం మండలంలోని నల్లబండగూడెం గ్రామం వద్ద వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇరువురు దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం



అశోక్‌రెడ్డి(ఫైల్)

మేళ్లచెర్వు, జనవరి 12 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో ఆర్థికంగా నష్టపోయి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెర్వులోని సిమెంట్ కంపెనీలో పనిచేస్తున్న వంటెద్దు అశోక్‌రెడ్డి(33) ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై అప్పులు చేశాడు. గతంలో తండ్రి మట్టారెడ్డి వ్యవసాయ భూమి విక్రయించి అప్పు తీర్చారు. అయినా మారని అశోక్‌రెడ్డి తిరిగి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి మరోసారి అప్పుల పాలుకావడంతో భార్య పావని, కుమార్తెతో తన స్వగ్రామం నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామానికి పంపించాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంటున్నట్లు ఫోన్‌లో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు చుట్టపక్కల ఇళ్ల వాళ్లను అప్రమత్తం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. తండ్రి మట్టారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..



సతీష్(ఫైల్)

శాలిగౌరారం, జనవరి 12 : మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ ఉప్పల సతీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెర్కకొండారం గ్రామానికి చెందిన మాచర్ల సతీష్(25)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలం నుంచి మద్యానికి బానిసగా మారి కుటుంబాన్ని పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. తాగవద్దని భార్య మందలించడంతో చనిపోతానని బెదిరించేవాడు. గతంలో కూడా పలుమార్లు పురుగుల మందు తాగి ఇంటికొచ్చేవాడు. ఈ నెల 5వ తేదీన గ్రామ శివారులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సతీష్ మృతి చెందాడని ఎస్‌ఐ సతీష్ తెలిపారు. తల్లి జానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన మహిళ...



శిరీష మృతదేహం

కొత్తపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డి కథనం ప్రకారం మన్సూరాబాద్ భవానీనగర్‌లో ఉండే శిరీష(30) భర్త గంరెడ్డి జానారెడ్డి స్వగృహ ఫుడ్స్ వ్యాపారం చేస్తున్నారు. జానారెడ్డి క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పెద్దమొత్తంలో పోగొట్టుకున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో శిరీష తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న మృతురాలి తండ్రి సంకలమద్ది సుధాకర్‌రెడ్డి నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం తోపుచెర్ల గ్రామం నుంచి మన్సూరాబాద్‌కు చేరుకుని కన్నీరుమున్నీరయ్యాడు. ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్‌హెచ్‌వో అంజిరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బైక్ దొంగ అరెస్టు

హాలియా, జనవరి 12: బైక్ దొంగను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు నల్లగొండ జిల్లా హాలియా ఏఎస్‌ఐ బావుసింగ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని ఓల్డ్‌బోయినపల్లికి చెందిన గన్నెరు రాజశేఖర్ ఈనెల 10న టీఎస్05జీబీ 8455 బైక్‌పై హాలియాకు వచ్చాడు. బైక్‌ను బస్టాండ్ వద్ద పార్క్ చేసి పని ముగించుకుని వచ్చే సరికి చోరీకి గురైంది. ఈ ఘటనపై పోలీసుల ఫిర్యాదు చేశాడు. పోలీసులు శుక్రవారం అలీనగర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పెద్దవూర మండలం కుంకుడుచెట్టుతండా నుంచి నల్లగొండకు వెళ్తున్న రమావత్ రవి అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో రాజశేఖర్ బైక్‌ను చోరీచేసినట్లు ఒప్పుకోవడంతో రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. రవిపై గతంలో 18 ఆస్తి సంబంధమైన కేసులు ఉన్నాయని, పలుమార్లు జైలుకు వెళ్లినట్లు తెలిపారు. రెండు రోజుల్లో బైక్ దొంగను రిమాండ్ చేసినందుకు డీఎస్పీ వెంకటగిరి, హాలియా సీఐ గాంధీనాయక్‌లు ఏఎస్‌ఐ బావుసింగ్‌తో పాటు సిబ్బంది శ్రవణ్, సైదానాయక్, రాజశేఖర్, మునినాయక్‌లను అభినందించారు.

నెంబరుప్లేట్స్ లేని బైకులు స్వాధీనం

నెంబరు ప్లేట్లు లేకుండా హాలియాలో పలుచోట్ల పార్క్ చేసిన మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ బావుసింగ్ తెలిపారు. హాలియాలో శుక్రవారం ఉదయం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నెంబర్ ప్లేట్లు లేని 8 బైక్‌లను గుర్తించి, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

గంజాయిని తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 12 : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం రిమాండ్ చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పాత హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని తనిఖీ చేయగా అతడి వద్ద కిలో 360 గ్రాములు గంజాయి లభించిందన్నారు. విచారించగా స్థానిక గాంధీనగర్‌కు చెందిన జమీల్‌గా గుర్తించామని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారులో మంటలు: ఇద్దరు సురక్షితం



చిట్యాల రూరల్, జనవరి 12 : జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా ఈ ప్రమాదం నుంచి ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్న నల్లబెల్లి మోహన్‌రామ్ అతడి స్నేహితుడు శివలు సంక్రాంతి పండుగకు వారి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో వెలిమినేడు శివారులో శ్రీఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలోకి రాగానే కారులోంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న మోహన్‌రామ్, శివలు హుటాహుటిన కారు దిగిపోయారు. ఇంతలో కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లుగా భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

15 మంది బాలకార్మికులకు విముక్తి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 12 : బాలకార్మికుల విముక్తి కోసం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో పోలీస్ ప్రత్యేక బృందం శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ చందనాదీప్తి ఆదేశాల మేరకు హాలియా ఎస్‌ఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు మండలాల పరిధిలో పర్యటించారు. పలుచోట్ల ఇటుకబట్టీలు, రైస్‌మిల్లులు, మెకానిక్ షెడ్లలో తనిఖీలు జరిపి 15 మంది బాలకార్మికులను గుర్తించారు. ఆపరేషన్ స్మైల్‌కింద గుర్తించిన బాలకార్మికులకు విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. అనంతరం 18 ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలతో పనిచేస్తున్న 11మంది యజమానులను గుర్తించారు. వారిలో ఇటుకబట్టీలు నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు, మెకానిక్ షెడ్ యజమానులు ఉన్నారు. ఆయా కేంద్రాల్లో బాలకార్మికులతో వెట్టిచాకిరి చేయించిన యజమానులపై బాలకార్మికుల నిర్మూలన చట్టంకింద క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటగిరి తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించేందుకు ఈ నెల 31వరకు పోలీస్‌శాఖ చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి ప్రజలు తోడ్పాటునందించాలని ఆయన కోరారు.

పథకాలను పకడ్బందీగా అమలుచేయాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

నేరేడుగొమ్ము, జనవరి 12: ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలుచేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. నేరేడుగొమ్ము రైతు వేదిక భవన్‌లో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలుచేయాలన్నారు. అధికారులు ప్రభుత్వ పథకాలను పేదలందరికీ అందేలా చూడాలన్నారు. అనంతరం వివిధ గ్రామాల సర్పంచులను ఎమ్మెల్యే బాలునాయక్ ఘనంగా సన్మానించారు. ఎంపీపీ బానావత్ పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ బాలు, ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి, తహసీల్దార్ నాగమ్మ, నాయకులు చిన్నబాలయ్య, పాపనాయక్, ఎంపీటీసీ యుగేందర్‌రెడ్డి, బిక్కునాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించిన సర్పంచులకు కృతజ్ఞతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కరీంపాష

కనగల్, జనవరి 12: ఐదేళ్లకాలంగా గ్రామాల అభివృద్ధికి సర్పంచులందరూ పార్టీలకతీతంగా సహకరించారని ఎంపీపీ కరీంపాష అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో ఒక దశలో ఎంపీపీ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పదవీకాలం ముగిసినా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు సమావేశంలో ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో రహదారుల ఆక్రమణలను తొలగించి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంపచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

మిర్యాలగూడ టౌన్, జనవరి 12: ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఎలిమేడు ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దైవ చింతనతో ఒత్తిడి, ఆందోళన తొలగి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో దేశిడి శేఖర్‌రెడ్డి, నాగాచారి పాల్గొన్నారు. ఈదులగూడ, హౌజింగ్ బోర్డులో పూజల్లో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, రాయపుడి భవాని, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మీభార్గవ్, పద్మ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి : సీపీఐ

దేవరకొండ, జనవరి 12: కాంగ్రెస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఐ నియోజకవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్లను పూర్తిచేసి సాగునీరు అందించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్న అర్హులైన పేదలందరికీ అందించాలన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములు, పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, షైనుద్దీన్, బుచ్చిరెడ్డి, కనకచారి, రామస్వామి పాల్గొన్నారు.

మహిళలు సాధికారతను సాధించాలి

తిరుమలగిరి(సాగర్), జనవరి 12: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ మహిళా సాధికారతను సాధించాలని ఐసీడీఎస్ సీడీపీవో గంధం పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు మహిళా సాధికారతపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతీ మహిళ స్వశక్తితో కుటుంబానికి అండగా నిలవాలని అన్నారు. ఆదేవిధంగా పోక్సో చట్టం, లింగ వివక్షపై, సఖి 181, బాలికల్లో రక్తహీనత వంటి విషయాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు దాటిన తర్వాతే బాలికలకు వివాహాలు చేయాలని అన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, రమణ, ఝాన్సీ, పుష్ప, లీల, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

మాడ్గులపల్లి, జనవరి 12: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుంచం రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎండి.అలీ, ఉపాధ్యక్షులు శ్రీలేఖ, వెంకటయ్యలతో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు.


నల్లగొండలో నివాళులర్పిస్తున్న యువజన సంఘాల నాయకులు



పీఏపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ రంజిత్‌రెడ్డి


వెలిమినేడులో నివాళులర్పిస్తున్న యువకులు


నల్లగొండలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న సత్యజీ


తపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న నాయకులు


మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని సభ్యులు



దేవరకొండలో డీఎస్ఏ ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌పీటీ


కట్టంగూరు: మునుకుంట్లలో వివేకానందుడి జయంతి


కొండమల్లేపల్లిలో కేక్ కట్ చేస్తున్న యువజన సంఘాల నాయకులు

స్వామివివేకానంద దార్శనికుడు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): స్వామి వివేకానంద గొప్ప దార్శనికుడు, మేధావి అని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ కాసం సత్యజీ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం తపస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివేకానందుని విగ్రహంతో పాటు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చికాగో సర్వమత సమ్మేళనంలో భారతదేశం గొప్పతనాన్ని, హిందుమతం ప్రాశస్త్యాన్ని ప్రపంచం ముందుంచారని పేర్కొన్నారు. వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘచాలక్ గార్లపాటి వెంకటయ్య మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖులు రాంరెడ్డి, బం డారు ప్రసాద్, కూతురు లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, చక్రధర్, వెంకయ్య, తులసి, నీ రజ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో వివిధ సంఘాలు, యువజన సమాఖ్యల ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరి దేవేందర్, బంగారయ్య, అమర్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి నారాయణయాదవ్, బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, పగిళ్ల కృష్ణ, సింగం రమేష్, దశరథ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూడారై ఉత్సవం

గంగాళాల్లో పాయసంతో స్వామి, అమ్మవార్లకు నివేదన



నల్లగొండలో కూడారై ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నల్లగొండ కల్చరల్, చిట్యాల రూరల్, నార్కట్‌పల్లి, జనవరి 12: ధనుర్మాస ఉత్సవంలో భాగంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం ఉదయం కూడారై ఉత్సవం ఘనంగా జరిగింది. గోదాదేవి రచించిన 27వ పాశురాన్ని ప్రవచనం పూర్తైన సందర్భంగా పండితులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి 108 గంగాళాల పాయసంతో నివేదన చేశారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదా రంగనాయక స్వామిలకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో సందడి చేశాయి.

జిల్లా కేంద్రంలోని రామగిరిలో గల సీతారామచంద్రస్వామి దేవాలయం, వీటీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడారై ఉత్సవం కన్నులపండువగా సాగింది. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణామాచార్య 27వ పాశురాన్ని ప్రవచనం చేశారు. చిట్యాల మండలం నేరడలోని సీతారామాంజనేయస్వామి దేవాలయం, నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈవో జయరామయ్య, చకిలం సంధ్యారాణి, వేణుగోపాల్‌రావు, వికాస తరంగిణి సభ్యులు, సర్పంచ్ దుబ్బాక శోభవెంకట్‌రెడ్డి, దుబ్బాక అనిల్‌వాసవ్య దంపతులు, ఆలయ చైర్మన్ బండారు శ్రీనివాస్ గీత దంపతులు, పాండురంగయ్య, దశరథ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతుబంధు, రుణమాఫీ వెంటనే అమలుచేయాలి : బీజేపీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జనవరి 12: వ్యవసాయ పెట్టుబడి కోసం రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ హరిచందనకు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రస్తుత యాసంగి సీజన్ పూర్తి కావస్తున్నందున ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులను జమ చేయకపోవడం విచారకరమన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన శ్రీశైలం సొరంగమార్గానికి తగిననిధులు మంజూరు చేసి పూర్తి చేయాలన్నారు. రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలపై సబ్సిడీలను పునరుద్ధరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా సీఎం ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట కాలపరిమితిలో అమలు చేయడానికి అధికారులను నియమించాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏమిరెడ్డి భిక్షంరెడ్డి, నాయకులు యాదగిరిచారి, నవీన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో
నీలగిరికి జాతీయ ర్యాంకు

రామగిరి, జనవరి 12: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో నల్లగొండ మునిసిపాలిటీ జాతీయస్థాయిలో 92వ ర్యాంకు సాధించింది. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ర్యాంకులో నీలగిరికి ఈ స్థానం దక్కింది. 2023లో లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో జాతీయ స్థాయిలో 446 పట్టణాలు పోటీపడగా నల్లగొండకు 92వ ర్యాంకు దక్కింది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో 11 పట్టణాలు పోటీ పడగా గ్రేటర్ హైదరాబాద్‌కి 1వ స్థానం రాగా కరీంనగర్ మునిసిపాలిటీ 2వ స్థానం దక్కించుకోగా, నల్లగొండ మునిసిపాలిటీ 3వ స్థానంలో నిలిచింది. గతేడాది నల్లగొండ మునిసిపాలిటీ 130వ ర్యాంకు సాధించగా ఈ సారి 38 పట్టణాలను వెనక్కి నెట్టి 92వ స్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా మిర్యాలగూడ 187, సూర్యాపేట 149 ర్యాంకులు సాధించాయి.

పరిశుభ్రత, మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త సేకరణ, రీసైక్లింగ్, వ్యర్థాల సద్వినియోగం, నీటి వనరుల పరిశుభ్రత, ఘనవ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై సర్వే జరిగింది.

పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలి

● మునిసిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దేవరకొండ, జనవరి 12: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా, తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మునిసిపల్ శాఖ హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండలోని మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దేవరకొండలో వార్డులు, దరఖాస్తుల సంఖ్య వివరాలను మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మునిసిపల్ మేనేజర్ ప్రశాంతి, అధికారులు ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 12: రానున్న వేసవిలో మంచినీటి సమస్య వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఆ విషయంలో చొరవ చూపాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. మిషన్ భగీరథ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు పేమెంట్లు కూడా త్వరగా చెల్లించాలన్నారు. ఈ సంక్రాంతి రైతులకు అనుకూలంగా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు లేదని ఏ ఎమ్మార్పీకి నీరు రావడంలేదని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ పరిధిలో నాగార్జునసాగర్, ఏపీ పరిధిలో శ్రీశైలం ఉంటుందన్నారు. ప్రాజెక్టుల్లో నీరు లేక పోవ డం వల్ల నాట్లు వేయలేకపోయారని అన్నారు. రెండు రాష్ట్రాలు తాగునీటి అవసరాల కోసం సాగర్‌లో 30 టీఎంసీల నీటిని నిల్వ ఉంచాలన్నారు. ఈ ఏడాది ప్రతీ పంట కూడా బాగా దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పన

నల్లగొండ, జనవరి 12: గ్రంథాలయ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ నల్లగొండ పర్సన్ ఇన్‌చార్జిగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని సంబంధిత ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బానోతు బాలమ్మ, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయాన్ని పరిశీలించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలి


ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో మక్బూల్ అహ్మద్

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 12: హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని డీఎస్‌డీవో మక్బూల్‌అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హ్యాండ్‌బాల్ పోటీలకు ఆదరణ ఉందని అందరూ కష్టపడి రాష్ట్ర జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లాకు మంచిపేరు తేవాలని, పోటీల్లో రాణించాలని ఆకాక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగే 45వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిక పోటీలు కొనసాగాయి. కార్యక్రమం లో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, కోచ్ గుప్తా, రామాంజనేయులు, వరమ్మ, వరుణ్, మహేష్, రామకృష్ణ, సాయిలు పోటీలను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల ఎంపిక ప్రవేశ పరీక్ష


పరీక్షా కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులు

నల్లగొండ టౌన్, జనవరి 12: నల్లగొండ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు డీలర్ల ఎంపిక ప్రక్రియకు నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాలలో శుక్రవారం పరీక్ష నిర్వహించారు. మొత్తం 20ఖాళీలకు 312 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకుని హాజరైయ్యారు. ఆర్డీవో రవి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం...

కట్టంగూరు: మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నపురి గ్రామంలో (కమ్మగూడెం) ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిష్కలక్క మాత దేవాలయ స్వర్ణ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చర్చి పాదర్ రాగోరి తెలిపారు.

దామరచర్ల: ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు తప్పనిసరిగా ఈ పాస్ ద్వారానే ఎరువులు, యూరియా విక్రయించాలని ఏవో కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీలు చేశారు. దుకాణదారులు తప్పకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

దేవరకొండ: దేవరకొండ పోస్టాఫీసులో నిర్వహించే ఆధార్ అప్‌డేట్ సెంటర్లను పెంచాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు కోరారు. ఒకే కౌంటర్ ఉండటంతో 50మందికే టోకెన్లు ఇచ్చి అప్‌డేట్ చేస్తున్నారని, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

● బీజేపీ జిల్లా అధ్యక్షునిగా బీసీ సామాజికవర్గానికి చెందిన నక్క వెంకటేష్‌యాదవ్‌ను నియమించాలని ఆ పార్టీ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు నేతాళ్ల వెంకటేష్‌యాదవ్ కోరారు.

శాలిగౌరారం: కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ అన్నారు. చేతివృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రధానమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. అర్హులైన వారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లగొండ టౌన్: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన దాసరి హరిచందనకు బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కనగల్: మండల కేంద్రమైన కనగల్ ఎక్స్‌రోడ్డుకు చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీల సంఘమిత్ర జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన సమావేశంలో నందమూరి లక్ష్మీపార్వతి ఈ పురస్కారాన్ని శివలీలకు అందజేశారు. ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ అవార్డును తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు.

మిర్యాలగూడ రూరల్: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు నర్సింగుల సోమయ్య ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. సీపీఎం నాయకులు రవినాయక్, వెంకన్న, శేఖర్ పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చిట్యాల రూరల్: మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన ఏనుగు రఘుమారెడ్డి ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లో కలిశారు. రఘుమారెడ్డి ఇద్దరు మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన రఘుమారెడ్డిని మంత్రులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

● **మునుగోడు రూరల్:** సమాచార హక్కు వికాస సమితి మండల కార్యదర్శిగా కుంభం ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బీజేఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలకు సమాచార వికాస సమితి కమిటీలు వేశారు.

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో గల మైనార్టీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు ఈనెల 18 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫరూక్ తెలిపారు. కళాశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపు ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాలిగౌరారం: బాల్య వివాహాలు చేయడాన్ని అడ్డుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండలంలోని చిత్తలూరు గ్రామంలో నిర్వహించిన మహిళా సాధికారత అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆడపిల్లల చదువుతోనే ఆ కుటుంబం అన్నిరంగాల్లో రాణిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తరాల శోభారాణి, ఎ.లలిత, కె.వసంత, ఎస్.అనిత, బాలింతలు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే వేముల


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 12: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ నియోజకవర్గమైన నకిరేకల్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆయన వినతిపత్రం అందజేశారు.

రోజ్‌గార్ దివస్ కచ్చితంగా నిర్వహించాలి

చిట్యాల, జనవరి 12: పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కచ్చితంగా రోజ్‌గార్ దివస్ నిర్వహించాలని డీఆర్‌డీవో కాళిందిని ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఆ సొమ్మును రికవరీ చేస్తామన్నారు. జాబ్‌కార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది 2023 మార్చి 31 వరకు మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,22,37,680 పనులు జరగ్గా, కూలీలకు రూ.2,04,50,547 వేతనాలుగా చెల్లించారు. సామగ్రికి రూ.17,81,133 చెల్లించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో కె.నవీన్‌కుమార్, అదనపు పీడీ ఉపేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ గోరీ, ఎంపీడీవో లాజర్, డీపీవో వేణుగోపాల్‌రావు, ఏపీవో శ్రీలత, ఎస్ఆర్‌పీ రాజు, తదితరులు పాల్గొన్నారు.